
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 29 జనవరి 2025




చాకలి చెరువును పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే శంకర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు


కార్యక్రమానికి హాజరైన శ్రీకాకుళం నగర ప్రజలు

శ్రీకాకుళం నగరం 31వ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో చాకలిచెరువు అధ్వానంగా ఉంది. పాములు, పందుల బెడద ఎక్కువగా ఉంది. మున్సిపల్ కుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా రావడం లేదు. కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. చాకలి చెరువు సమీపంలో ప్రైవేటు ఖాళీస్థలంలో గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి వేళల్లో ఆడపిల్లలు అటుగా వెళ్లేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేయాలి.
- ఇదీ 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ప్రజల విన్నపం.

....

● ఈ సమస్యలపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. 'నెల రోజుల నుంచి రెండు నెలల్లో వినతులన్నింటినీ పరిష్కరిస్తాం. అవసరమైన చోట రోడ్లు, కాలువల నిర్మాణానికి, పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపడతాం. త్వరలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామ'ని హామీ ఇచ్చారు. అలాగే చాకలి చెరువును పరిశీలించారు. సత్వరమే పూడిక తొలగించి మంచి నీటి చెరువుగా మార్పు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ ప్రదేశంలో గంజాయి, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడు తున్న వారిపై నిఘా సారించాలని పోలీసులకు సూచించారు.

సమస్యల పరిష్కారానికి

అధిక ప్రాధాన్యం


- శ్రీకాకుళాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం
- అవసరమైన రోడ్లు, కాలువలు నిర్మిస్తాం
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి విశేష స్పందన



శ్రీకాకుళం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 'సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తాం. జిల్లాతో పాటుగా శ్రీకాకుళం నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామ'ని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం నగరం 31వ డివిజన్‌లో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. డివిజన్ వాసులతోపాటు శ్రీకాకుళం, ఎచ్చెర్ల, టెక్కలి నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కూడా పాల్గొని తమ సమస్యలను నేరుగా కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి వినతులను కేంద్రమంత్రి, ఎమ్మెల్యే స్వీకరించి నెల నుంచి రెండు నెలల్లో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు.. ప్రజాప్రతినిధులకు మధ్య వారధిలా 'ఆంధ్రజ్యోతి' నిలిచింది. దీనివల్ల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని.. వెంటనే పరిష్కార చర్యలు కూడా చేపట్టేందుకు వీలుంటుంది. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎమ్‌డీ వేమూరి రాధాకృష్ణ గారిని ప్రత్యేక అభినందిస్తున్నాం. ప్రజలు ఎక్కువ మంది పింఛన్‌లు, రేషన్ కార్డుల గురించి సమస్యలు వివరించారు. ప్రస్తుతం సర్వే జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు ఉందని, కారు ఉందని.. వేర్వేరు కారణాలతో అర్హులకు పింఛన్లు, కార్డులను రద్దుచేసింది. ఇప్పుడు వాటిపై సర్వే జరుగుతోంది. త్వరలో అందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం. అలానే టిడ్కో ఇళ్ల గురించి పలువురు విన్నవించారు. 2014-19 మధ్య కాలంలో పట్టణ ప్రజలకు సొంత ఇళ్లు ఉండాలన్న ఉద్దేశంతో లబ్ధిదారుల నుంచి డీడీలు తీసుకుని వారికి ఇళ్లు నిర్మించారు సీఎం చంద్రబాబునాయుడు. ఇళ్లు అప్పగించే వేళ ప్రభుత్వం మారింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాక్షసత్వంగా వ్యవహరించింది. ఇళ్లు అప్పగించలేదు. సెంటు స్థలం అంటూ గందరగోళం చేసింది. అన్నాక్యాంటీన్‌లను కూడా వైసీపీ ప్రభుత్వం మూసివేయించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అన్నాక్యాంటీన్లను పునరుద్ధరించాం. పింఛన్ మొత్తాన్ని పెంచాం. అలాగే అన్ని కార్యక్రమాలు ఒకేదఫా అమలు చేయాలన్నా ఆర్థిక పరిస్థితి వల్ల కొంత ఇబ్బందులున్నాయి. గత ఐదేళ్లు రాష్ట్రంలో పెట్టుబడులు లేవు. పరిశ్రమలు లేవు. చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న కారణంతో వెల్లువలా పెట్టుబడులను పెట్టే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారు. త్వరలో అన్ని పథకాలు అందరికీ వర్తిస్తాయి. గత ప్రభుత్వం కనీసం రోడ్లు, కాలువలను కూడా బాగుచేయలేదు. ప్రభుత్వం ఏర్పడగానే మురుగునీటి వ్యవస్థను చక్కదిద్దాం. ముఖ్యంగా ఈరోజు ఇచ్చిన వినతులన్నింటిపై అత్యంత ప్రాధాన్యం ఇచ్చి అధికారులు పరిష్కరించేలా మేము కూడా ఫాలో అప్ చేస్తాం. అన్నిచోట్లా (మిగతా 4వ పేజీలో..)

సమస్యలను అధిగమిస్తున్నాం: ఎమ్మెల్యే గొండు శంకర్



● ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 31వ డివిజన్ పరిధిలో దండి వీధి, సాయి నగర్ కాలనీ, పట్నాయక్ కాలనీల్లో కొన్ని చోట్ల టెండర్లు పిలుస్తున్నా.. కోర్టు సమస్య వల్ల కొంతమంది రోడ్లు వేయనివ్వడంలేదు. ఇప్పుడు అవన్నీ అధిగమిస్తున్నాం. త్వరలో పూర్తిచేస్తాం. కాలువ నుంచి మురుగునీరు పోయేలా సరిచేస్తాం. పది వేల కనెక్షన్‌లు అమృత్ పథకం కింద నీటి వసతి కల్పిస్తాం. దోమల మందులను స్ప్రే చేయిస్తాం. ఇప్పటికే పెద్దఎత్తున పూడిక తీత చేయించాం. మళ్లీ చేయిస్తాం. అసెంబ్లీలో ఒక రోజు టిడ్కో ఇళ్లపై చర్చించాం. వైసీపీ నేతలు దుర్మార్గంగా వ్యవహరించారు. తర్వాత సెంటు స్థలం కోసం రూ.30వేలు చొప్పున తీసుకున్నారు. సీఎం సీరియస్‌గా ఉన్నారు. డబ్బులు కట్టిన టిడ్కో లబ్ధిదారులను బాధ్యతగా ప్రభుత్వం చూసుకుంటుంది. ఎవరూ అధైర్యపడొద్దు. మీ అందరికీ ఇళ్లు నిర్మిస్తాం. రేషన్ కార్డులు, పింఛన్ల కోసం అర్హులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో చేపట్టిన ఇటువంటి కార్యక్రమాలు పలుచోట్ల నిర్వహించాలి. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్'కు హృదయ పూర్వక ధన్యవాదాలు' అని తెలిపారు.


మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, పక్కన డీఐజీ, ఎస్పీ తదితరులు

'గంజాయి'పై ఉక్కుపాదం

- అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ
- ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలి: డీజీపీ ద్వారకా తిరుమలరావు

శ్రీకాకుళం క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి మూలాలపై ఉక్కుపాదం మోపామని, గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలో ఆయన పర్యటించారు. ముందుగా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ఒకటో డిపోని సందర్శించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. డీఐజీ గోపినాథ్ జెట్టీ, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ.. 'గడిచిన ఏడు నెలల్లో శ్రీకాకుళం జిల్లా పోలీసులు అత్యుత్తమ పనితీరుతో మంచి ఫలితాలు సాధించడం అభినందనీయం. ప్రజలకు పారదర్శకమైన సేవలందించి పోలీసుశాఖ కీర్తిని పెంపొందించాలి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి సైబర్ నేరాలు ఛేదించాలి. బిహార్ సుపారీ గ్యాంగ్‌తో సహా ఆలయాల్లో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్ కేసులను ఛేదించి ప్రోపర్టీ రికవరీ చేయడం జిల్లా పోలీసుల ప్రతిభకు నిదర్శనం. ఇదే స్ఫూర్తితో పెండింగ్ కేసులు త్వరితగతిన ఛేదించాలి' అని తెలిపారు.

ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

గంజాయి నివారణకు రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ ఎలిట్ యాంటీ నార్కోటిక్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. విశాఖ రేంజ్‌లో మొత్తం 39 వేల కేజీల గంజాయిని నిర్వీర్యం చేశామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఈగల్ (మిగతా 6వ పేజీలో..)

భక్తజన శంబరం

● ఘనంగా పోలమాంబ సిరిమానోత్సవం 4లో


పోలమాంబ
సిరిమానోత్సవం.. పాల్గొన్న భక్తులు


అరసవల్లిలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

దేశం మెచ్చేలా రథసప్తమి ఉత్సవాలు

- నగర సుందరీకరణ పనులు పూర్తి చేయండి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- 2, 3 తేదీల్లో క్రీడా పోటీలు : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

4లో

మామిడికి మంచు దెబ్బ

- మాడిపోతున్న పూత
- మరోవైపు తెగుళ్ల బెడద
- ఆందోళన చెందుతున్న రైతులు


బూర్జపాడులో మాడిపోయిన మామిడి పూత

ఇచ్ఛాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆదిలోనే మామిడికి మంచు దెబ్బ తగులుతోంది. ప్రస్తుతం మామిడి చెట్లు పూత పూయగా.. ఓ వైపు పొగ మంచు, మరోవైపు తెగుళ్ల ప్రభావంతో పూత మాడిపోతోంది. దీంతో కాయల దిగుబడి తగ్గనుందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్నాళ్ల కిందట వరుసగా వర్షాలు కురవడం.. రాత్రి ఉష్ణోగ్రతల్లో సమతుల్యత లేకపోవడం, విపరీతంగా మంచు కురుస్తుండడంతో మామిడికి ప్రతికూల పరిస్థితులు తలెత్తాయని వాపోతున్నారు. జిల్లాలో 12వేల హెక్టార్లలో మామిడి చెట్లు ఉన్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకూ మామిడి పూత వస్తుంది. ప్రస్తుతం రసాలు, పనుకులు, సువర్ణరేఖ రకాలకు సంబంధించి పూత పూసింది. మరికొన్ని రకాలు పూతకు వచ్చే దశలో ఉన్నాయి. వర్షాల కారణంగా కొంత పూత రాలిపోయింది. పూత రాని చెట్లు సైతం మరింత ఆలస్యం అవుతుండడంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. దీనికి తోడు తేనె మంచు పురుగు సోకి పూత నాశనం అవుతోంది. ఆంత్రోక్నోజ్ అనే మచ్చ తెగులు కూడా సోకింది. తోటల్లో కలుపు ఎక్కువగా ఉండడంతో చాలా ప్రాంతాల్లో ఈ తెగళ్లు శరవేగంగా వ్యాపిస్తున్నాయి.

● ఉద్దానం రైతు విలవిల

ఉద్దానంలో జీడి, కొబ్బరితో పాటు మామిడి పంట ఆశాజనకంగా ఉంటేనే రైతులకు సాంత్వన. లేదంటే దిగులే. ఈ ఏడాది అకాల వర్షాలతో వరి దెబ్బతింది. ఇప్పుడు మామిడి పంట కూడా నాశనమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా నుంచి కొబ్బరితో పాటు మామిడిని కోల్‌కత్తా, ముంబాయి, ఢిల్లీ, ఒడిశా, బరంపురం, భువనేశ్వర్‌కు తరలిస్తుంటారు. మామిడిపండ్ల రకాలను బట్టి టన్ను రూ.35వేల నుంచి రూ.50వేల వరకూ ధర పలుకుతుంది. కొన్నేళ్లుగా దిగుబడి తగ్గుతోంది. ఒకప్పుడు (మిగతా 6వ పేజీలో..)

శ్మశానానికి రోడ్డు వేయండి

● మృతదేహంతో బుడుమూరు దళితుల ఆందోళన

లావేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికకు రహదారి వేయాలని కోరుతూ మృతదేహంతో ఆందోళన చేసిన ఘటన లావేరు మండలం బుడుమూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని శ్మశానికి తీసుకెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో గ్రామానికి చెందిన దళితులు ఆందోళన చేశారు. మృతదేహాన్ని పాడెపై మోస్తూ జాతీయ రహదారి గుండా ఆందోళన చేశారు. బురదలో దిగి పంట పొలాల గుండా ఆపసోపాలు పడి మృతదేహాన్ని శ్మశానికి తరలించారు. గ్రామంలో ఎవరు మృతి చెందినా ఇదే పరిస్థితి నెలకొంటుందని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శ్మశానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మృతదేహంతో ఆందోళన చేస్తున్న బుడుమూరు దళితులు

ఆరు కేంద్రాల్లో 'సదరం'
ధ్రువపత్రాల పునః పరిశీలన

....

జగతిమెట్ట ఇళ్ల కాలనీలో
హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

6లో

రిమాండ్ ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు

6లో

సమస్యలు విని.. తక్షణమే స్పందించి!

- పరిష్కారానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశం
- 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి మంచి స్పందన
- 31వ వార్డులో పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు
- ఏళ్ల తరబడి ఉన్న సమస్యల ఏకరవు
- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'


సమస్యలపై కమిషనర్‌కు సూచనలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

అరసవల్లి/అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని 31వ వార్డు.. హెచ్‌బీ కాలనీలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. డివిజన్ ఇన్‌చార్జి విభూది సూరి బాబు సహకారంతో నిర్వహించి న ఈ కార్యక్రమంలో స్థానిక సాయినగర్ కాలనీ, దండి వీధి, పట్నాయకుని కాలనీ, మండల వీధి ప్రజలు పెద్ద ఎత్తు న పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కార్పొ రేషన్ కమిషనర్ ప్రసాదరావులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా కేంద్ర మంత్రికి విన్నవించు కున్నారు. ప్రతి సమస్యపై కేంద్రమంత్రి స్వయంగా స్పందిస్తూ.. అధికారు లకు సూచనలిస్తూ... తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, పారిశు ధ్యం తదితర సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున మంత్రికి, ఎమ్మెల్యేకు విన తులు అందజేశారు. వీటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావును కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు.


హాజరైన మహిళలు, విద్యార్థులు

● పందుల స్వైరవిహారం..



మా వీధిలో చెత్త రోడ్లపైనే ఉండిపోతోంది. కాలువలు లేక మురుగునీరు రోడ్లపై నిల్వ ఉంటోంది. దీంతో వీధి కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సమస్యను పరిష్కరించి..ఆదుకోండి.

-శివచరణ్, సాయినగర్ కాలనీ

● **కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు:** 'వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించండి. తక్షణం పారిశుధ్య పనులు చేపట్టి, కాలువలు శుభ్రం చేసి.. దోమలు లేకుండా ఫాగింగ్ చేయండి' అని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావును ఆదేశించారు.

● ఆరేళ్లుగా వడ్డీలు, ఇంటి అద్దె రెండూ కడుతున్నాం..



గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇంటి కోసం రూ.లక్ష చెల్లించాం. ఇల్లు పూర్త యి.... చేతికొచ్చే సమయానికి ప్రభుత్వం మారి పోయింది. గత ప్రభుత్వం ఇల్లూ ఇవ్వలేదు. డబ్బులూ ఇవ్వలేదు. అప్పు తెచ్చిన రూ.లక్షకు వడ్డీ, ఇంటికి అద్దె చెల్లిస్తూ అష్టకష్టాలు పడుతున్నాం. మాకు న్యాయం చేయండి.

-దుగ్గిరాల పద్మ, ఏపీహెచ్‌బీ కాలనీ

● **కేంద్ర మంత్రి:** టిడ్కో ఇళ్ల విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా పట్టుదలతో ఉన్నారు. డబ్బులు చెల్లించిన వారందరికీ ఇళ్లు ఇచ్చి తీరాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. తొలి ప్రాధాన్యంగా చెల్లించిన వారందరికీ త్వరలోనే ఇళ్లు అందజేస్తాం.

● రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం..



మా కాలనీలో రోడ్లు సరిగా లేవు. డ్రెయిన్లు కూడా నిర్మించలేదు. విద్యుత్తు సరఫరా కూడా అంతంత మాత్రమే. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు.

-బి.గౌరీ శంకర్, పట్నాయకుని కాలనీ

● **కేంద్ర మంత్రి:** గత ప్రభుత్వం నిర్ల క్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్న విషయం మాకు తెలుసు. తొలి ప్రాధా న్యంగా నగరంలో రోడ్లు, డ్రెయిన్లు, పరిశుభ్రత పనులను నిర్వహిస్తున్నాం. మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై తక్షణం స్పందించి, కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

● గంజాయి బ్యాచ్‌తో భయం..



మా కాలనీలో వినియోగంలో లేని చెరువుతో ఇబ్బందిగా ఉంది. సాయంత్రమైతే గంజాయి బాబులు, ఆకతాయిలు, మందుబాబులు విచ్చలవి డిగా తిరుగుతుండడంతో ఆడపిల్లలు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి ఉంది. చెరువులో నీరు కలుషితం కావడంతో దోమలు, పాములు అధికమయ్యాయి.

-బి.దుర్గావతి, సాయినగర్ కాలనీ

● **కేంద్ర మంత్రి:** 'మేం స్వయంగా వచ్చి పరిశీలిస్తాం. వెంటనే తక్షణ చర్యలకు ఆదేశిస్తాం. భయపడాల్సిందేమీ లేదు' అని భరోసా ఇచ్చారు. కార్యక్రమం అనంతరం కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, ఒకటో పట్టణ ఎస్‌ఐతో కలిసి వెళ్లి ఆ ప్రాం తాన్ని పరిశీలించారు. తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

● డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి..



20 ఏళ్లుగా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ ఒకేలా ఉంది. ఇళ్లు, జనాలు పెరిగినా కాలువలు వెడల్పు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

-దొంతం పార్వతీశం, రిటైర్డు టీచర్, ఏపీహెచ్‌బీ కాలనీ

● **కేంద్రమంత్రి:** కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక నగరాల్లో డ్రైనేజీలు, రోడ్లు, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాం. 'కాలనీలో కాలువలు వెడల్పు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని, పనులను సత్వరమే చేపట్టాల'ని కమిషనర్‌ను ఆదేశించారు.

● డిగ్రీ చదువుకున్నా... ఉపాధి కల్పించండి



నేను డిగ్రీ వరకు చదువు కున్నాను. పెళ్లయి, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. గడచిన ఐదేళ్లలో ఉద్యోగావకాశాలు కూడా కల్పించలేదు. ఏదైనా ఉపాధి కల్పిస్తే కుటుంబ మంతా మీకు రుణపడి ఉంటాం.

-ముంగి కాంచన, దండి వీధి

● **కేంద్ర మంత్రి:** రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా చర్యలు తీసుకుంటోంది. మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తూ వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తోంది. తగిన శిక్షణకు సిఫారసు చేసి, అనంతరం ఉద్యోగం కల్పిస్తాం.

● కొళాయి మంజూరు చేయండి..



అందరం ఇళ్లు నిర్మించుకున్నాం. తాగునీటికి మాత్రం ఎప్పుడూ ఇబ్బందే. మున్సిపల్ అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. దయచేసి మంచినీటి సదుపాయం కల్పించండి.

-తొండ్ర వెంకటరమణమూర్తి, సాయినగర్ కాలనీ


కార్యక్రమానికి హాజరైన కాలనీవాసులు


కార్యక్రమం లక్ష్యాన్ని వివరిస్తున్న స్టాఫర్ సురేష్

● **కేంద్రమంత్రి:** అమృత్ పథకంలో భాగంగా వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలని కమిషనర్‌కు ఆదేశించారు.

● వితంతు పింఛను తీసేశారు..



నా భర్త మరణించాక ఇద్దరు పిల్లలతో ఎంతో కష్టంగా బతుకుతున్నాను. నాకు 65 శాతం వైకల్యం ఉంది. గతంలో పింఛను వచ్చేది. కానీ 2023 నవంబరులో అది ఆగిపోయింది. ఉన్న చిన్నపాటి ఆధారం కూడా పోయింది. ఎలా బతకాలో తెలియడం లేదు. మరలా పింఛను కోసం దరఖాస్తు చేశా. సాయం చేయండి.

-మైలపిల్లి మాధవి, ఏపీహెచ్‌బీ కాలనీ

● **కేంద్రమంత్రి:** మరో రెండు, మూడు నెలల్లో అర్హులైన వారందరికీ పింఛన్లు ఇస్తాం.

కేంద్రమంత్రి స్పందనపై హర్షాతిరేకాలు..

శ్రీకాకుళం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజల సమస్యలపై వెనువెంటనే స్పందించారు. ముఖ్యంగా సాయినగర్ కాలనీలో చాకలి చెరువు వల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వివరించడంతో నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావును వెంటబెట్టుకుని వెళ్లి... పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. చెరువులో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆహ్లాదంగా మార్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి ఆదేశించారు. ఖాళీస్థలాలు గంజాయి బ్యాచ్ అడ్డాగా మారడం.. ఇతర అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతుందన్న విషయాన్ని మంత్రి, ఎమ్మెల్యేకు తెలపడంతో.. వెంటనే స్పందించారు. ఇటువంటి వాటిని నిరోధించాలని.. ఖాళీ స్థలాలు ఎవరివన్నది గుర్తించి.. వాటిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి ఆదేశించారు. కార్యక్రమం జరిగిన రోజునే కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే స్పందించి చర్యలు చేపట్టడం.. క్షేత్ర స్థాయిలో పరిశీలించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' కృషిని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, సీర రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

(మూడో పేజీ తరువాయి)

కాలువలు ఏర్పాటుచేసేలా చర్యలు తీసు కుంటున్నాం. చాకలి చెరువును అభివృద్ధి చేస్తాం. ఆ పరిసరాల్లో జరుగుతున్న అ సాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేలా అధికారులను ఆదేశిస్తున్నాం. కుక్కలు, పందు లు, దోమలు, పాముల సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఇక్కడే నగరపాలక సంస్థ అధికారులకు ఆదేశిస్తున్నాం. అంతటా డ్రైనేజీ వ్యవస్థను తీర్చిదిద్దుతాం. ఇటువంటి కార్యక్రమాలు ప్రతి వార్డుల్లోనూ ఆంధ్రజ్యోతి నిర్వహించాలి. ఇళ్లులేనివారికి సొంత స్థలం ఉంటే వారికి రూ. 2.5 లక్షలు ఉచితంగా లబ్ధి చేకూరుస్తాం. శ్రీకాకుళం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం. అన్ని విషయాల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలి. రథసప్తమిని రాష్ట్ర పండగగా వైభవంగా నిర్వహిస్తాం. దేశ విదేశాల నుంచి వచ్చే ప్రజలు రథసప్తమినాడు సూర్యభగవానుడి ఆశీస్సులు పొందాలి అని కోరుతున్నా' అని తెలిపారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' శ్రీకాకుళం యూనిట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్.సోమశంకర్, టీడీపీ వార్డు నాయకులు విభూది సూరిబాబు, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, పట్టణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ శీర రమణయ్య, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

ఎంత పెద్ద పాములో..

● వీరభద్రాపురంలో కలకలం ● ఒకేచోట నాలుగు ప్రత్యక్షం


అటవీ శాఖ అధికారులు పట్టుకున్న భారీ విషసర్పాలు

పలాస, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం వీరభద్రాపురం గ్రామ సమీపంలో భారీ రక్తపింజరి పాములు కలకలం సృష్టించాయి. వీటిని కాశీబుగ్గ అటవీ శాఖ అధికారుల సమాచారంతో ఈస్ట్రన్‌ఘాట్స్ వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు ఓంకార్‌త్యాడి చాకచక్యంగా పట్టుకొని.. సమీప అడవుల్లో విడిచిపెట్టారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం రాత్రి గ్రామ శివారులోని పంట పొలాల్లో నిద్రించేందుకు రైతులు వెళ్లగా...సమీపంలోని కర్రల కింద భారీ శబ్దాలు వినిపించాయి. కర్రలు తొలగించి చూడగా ఏడు అడుగుల పొడవు ఉన్న భారీ రక్తపింజరి పాములు నాలుగు కనిపించాయి. వెంటనే వారు కాశీబుగ్గ అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఓంకార్‌తో కూడిన అటవీ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఓ పాము గుట్టల్లోకి వెళ్లిపోవడంతో కనిపించలేదు. మిగిలిన మూడు పాములను అతికష్టం మీద పట్టుకొని సమీప అడవుల్లో విడిచిపెట్టారు. ఇవి అత్యంత విషపూరితమైనవని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

దేశం మెచ్చేలా రథసప్తమి ఉత్సవాలు

● నగర సుందరీకరణ పనులు పూర్తి చేయండి ● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన రథసప్తమి ఉత్సవాలను దేశం మెచ్చేలా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్న రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను, నగర సుందరీకరణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'డివైడర్ల మధ్యలో పచ్చదనం ఉండేలా చూడాలి. ముందుగానే విద్యుత్తు స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయాలి. ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 4.5 కిలోమీటర్ల మేర నిర్వహించనున్న ఆదిత్యుని శోభాయాత్రను తిరుపతిలో జరిగే గరుడసేవ మాదిరిగా నిర్వహించాలి. ఈ శోభాయాత్రకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నగరంలోని 5 ముఖ్య కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర భవిష్యత్తుకు అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయం మూలం కానుంది.' అని తెలిపారు. అనంతరం క్యూలైన్లు, భక్తులకు సౌకర్యాలు, పాసుల జారీ, టిక్కెట్ల విక్రయాలు, తదితర అంశాలపై ఆలయ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఎస్ఈ సుగుణాకరరావు, డీపీవో భారతి సౌజన్య, ఆలయ ఈవో భద్రాజీ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో క్రీడా పోటీలు..

శ్రీకాకుళం స్పోర్ట్స్/ అరసవల్లి/ శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 2, 3 తేదీల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్, జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్, గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వాలీబాల్ విజేతలకు రూ.లక్ష, వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు రూ.20వేలు, గ్రామీణ క్రీడల విజేతలకు రూ.60వేల చొప్పు న నగదు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. వివరాల కోసం 99498 61168(ఆర్.అప్పన్న) నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

● క్రీడా పోటీలకు సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్లను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మంగళ వారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ పాల్గొన్నారు.


క్రీడలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి తదితరులు



శంబరలో ఘనంగా సిరిమానోత్సవం

● మార్మోగిన పోలమాంబ నామస్మరణ

మక్కువ/సాలూరు రూరల్/సాలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అశేష భక్తజనులతో శంబర మురిసింది. సిరి సంబరం అంబరా న్నంటింది. అమ్మవారిని దర్శించి భక్తజనం పులకించింది. అంతటా పోలమాంబ నామస్మరణ మార్మోగింది. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళ వారం అంగరంగ వైభవంగా సాగింది. పోలీసుల మూడంచెల భద్రత మధ్య సంప్రదాయబద్ధంగా ప్రధాన ఘట్టం ముగిసింది. సిరిమానో త్సవం అరగంట ఆలస్యంగా మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమైంది. తొలుత గ్రామ వీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరే గించారు. వాటికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్ర దాయం ప్రకారం సిరిమానును జన్ని పేకాపు రామారావు అధిరో హించారు. తొలుత అయన్ని చదురు గుడి నుంచి సాడేపు కుటుంబీ కులు భుజాలపై మోసుకొని వచ్చారు. ఆతర్వాత 36 అడుగుల సిరిమానుపై కూర్చో బెట్టారు. ఆ సమయానికి మంగళ వాయిద్యాల మధ్య సిరిమాను వద్దకు ఘటాలు వచ్చాయి. సిరిమాను, ఘటాలు ముందుగా గిరడ, కుప్పిలి, పూడి వారిళ్లకు వెళ్లగా ఆయా కుటుంబీ కులు పూజలు చేశారు. అనంతరం ఘటాలు దక్షిణ దిక్కుగా, సిరిమాను తూర్పు దిక్కుగా వెళ్లాయి. అవి మళ్లీ పణుకు వీధిలో కలిశాయి. అక్కడ పాడిపిరెడ్డి కుటుంబీకులు, తీళ్ల వారి వారసులుగా అక్యాన కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు. సిరిమాను వెనకకు వచ్చి గొల్లవీధి, కొత్తవీధి మీదుగా పెద్దమ్మ గుడి వద్దకు చేరింది. అక్కడ నుంచి వెను తిరిగి నడివీధికి చేరుకొని ఆగిపోయింది. అక్కడ సాడేపు కుటుంబీలు మళ్లీ జన్ని పేకాపు రామారావును సిరిమాను నుంచి దించి భుజాలపై చదురుగుడికి తీసుకెళ్లారు. సిరిమానోత్సం మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.15 గంటలకు ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. మరికొందరు పసుపు కుంకుమలు, చీరలు, కోళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. ఇంకొందరు అక్కడే ఉన్న తోటల్లో వంటలు చేసు కుని సామూహికంగా భోజనాలు చేశారు. మొత్తంగా శంబర గ్రామం కళకళలాడింది. బంధువులు, స్నేహితులతో వీధులన్నీ కిక్కిరిసిపో యాయి. మరోవైపు జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 689 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశారు.

ఆరుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

రణస్థలం, జనవరి 28(ఆంధ్రజ్యోతి):ఎచ్చెర్ల మండలంలోని ఫరీద్‌పేట పంచాయతీకి సంబంధించి ఆరుగురు పంచాయతీకార్యదర్శులకు డీపీవో కె.భారతి సౌజన్య షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఫరీద్‌పేట పంచాయతీలో కొన్నేళ్లుగా రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో న్యాయవాది, స్థానిక టీడీపీ నాయకుడు కొత్తకోట అమ్మినాయుడు ఇటీవల జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేసిన విషయం విదితమే. ఈవిషయంపై అధికారులు స్పందించి ఈ పంచాయతీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న బాధ్యులైన ఆరుగురుకార్యదర్శులకు షోకాజ్ నోటీసులు మంగళవారం జారీచేశారు. కొన్నేళ్లుగా పంచాయతీకి సంబందించిన రికార్డుల నిర్వహణ లేకపోవడంతో ఇటీవల కలెక్టర్ నిర్వహించిన ఫిర్యాదుల విభాగం దృష్టికి అమ్మినాయుడు తీసుకువెళ్లారు. ఈమేరకు పంచాయతీలో గతంలో కార్యదర్శులుగా పనిచేసిన ఎస్.సాయికిరణ్, పి.జగదీష్, అబ్దుల్ సంషన్ బేగం, ఎం.రాజేశ్వరి,పి.శ్రీనివాసరావు,పి.సుధారాణిలకు షోకాజ్‌నోటీసులు జారీఅయ్యాయి. రికార్డులు నిర్వహణ విషయంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని డీపీవో కె.భారతి సౌజన్య షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు.

రోడ్డు పనుల బిల్లు చెల్లించండి

పొందూరు, జనవరి(ఆంధ్రజ్యోతి) 28: పని ఒకరుచేస్తే బిల్లు వేరొకరికి మంజూరుచేసిన అధికారుల నిర్లక్ష్యంపై టీడీపీ నాయకుడు కూన సత్యనారాయణ, కాంట్రాక్టర్ బాడానశేషగిరి మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో అధికారులను నిలదీశారు. పెనుబర్తి పంచాయతీ పరిధిలోగల అలమాజీపేటలో చేసిన రోడ్డు పనులకు సంబంధించి బాడాన శేషగిరికి కోర్టు ఆదేశాలతో గతంలో రూ.4 లక్షలు చెల్లించారు. రెండో బిల్లు రూ.3,24,939లు 2022 జూలైలో అధికారులు పెనుబర్తికి చెందిన వైసీపీ నాయకులు టి.మురళీకృష్ణ పేరుతో వెండర్‌కోడ్ సృష్టించి బిల్లును ఆయన ఖాతాలో వేశారు. రోడ్డు పనులు నిర్వహించిన గిరి ఎన్నిసార్లు అధికారులను ప్రశ్నించినా సమాధానం ఇవ్వలేదు. ఇంతలో ప్రభుత్వం మారడంతో పనిచేసిన గిరికి బదులు మరో వ్యక్తికి బిల్లు చెల్లించినట్లు గుర్తించారు. పంచాయతీరాజ్ ఈఈ సైతం తప్పుడు వెండర్ కోడ్‌తో వేరొకరికి బిల్లు చెల్లించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వక ఆదేశాలిచ్చినా అధికారులు స్పందించడంలేదు. ఎమ్మెల్యే కూన రవికుమార్ సైతం ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా చర్యలు తీసుకోకపోవడంతో టీడీపీ నాయకులు సత్యనారాయణ, బాడాన గిరి, వార్డుసభ్యుడు బాడాన శ్రీహరి మంగళవారం ఎంపీడీవో మన్మథరావును కలిసి బిల్లు మంజూరుచేయాలని కోరారు. కాగా చెల్లింపుపై చర్యలు తీసుకుంటామని, బిల్లు తిరిగి ఇచ్చేఏర్పాట్లు చేస్తామని ఎంపీడీవో హామీఇచ్చారు.

నీటి పథకం నిర్మాణంలో అలసత్వంపై నిలదీత

జి.సిగడాం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వాండ్రంగిలో మంచినీటి పథకం నిర్మాణంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, పలుసార్లు గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదుచేసినా సమాచారం ఇవ్వకపోవడంపై సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ బూరాడ శ్రీదేవి నిలదీశారు.మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీలకు సంబందించిన చిన్నచిన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని సర్పంచ్‌లు లక్ష్మణరావు, అప్పలనాయుడు, మహదాశ్యం చిన్నారావు, వడిశ మహేష్, తొత్తడి రామారావు, తిరుమరెడ్డి వెంకటరావు, కంది రమాదేవి ప్రశ్నించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్‌ఎంపీపీలు సాధ్వీమణి, వెంకటరావు, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

కొబ్బరి పంటకు బీమా చేసుకోవాలి

కవిటి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలోని రైతులు కొబ్బరి పంటకు బీమా చేయించుకోవాలని టెక్కలి ఉద్యానవనశాఖ సహాయసంచాలకురాలు ఎస్‌.శైలజ కోరారు. మంగళవారం బైరిపురంలో కొబ్బరిరైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు తోటల్లో ఉన్న చెట్ల మేరకు బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి పి.మాదవీలత, ఎంపీఈవో లలిత, బాలరాజు, శరణ్య పాల్గొన్నారు.

పాల దిగుబడిపై పోటీలు

ఆమదాలవలస, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం జిల్లాల పరిధిలోని పాల దిగుబడినిచ్చే పాడిపశువుల మధ్య పోటీలు నిర్వహించి అధిక దిగుబడి ఉన్న పశువులకు పారితోషికం అందించనున్నట్లు పశు సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లా తోటపాలెంలో ఫిబ్రవరి చివరి వారంలో పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సాహివాల్, ఒంగోలు, గిరిరాధీ, నాటు ఆవు, జెర్సీ క్రాస్ ,హెచ్‌ఎఫ్ క్రాస్ పశుజాతులు పశువుల మధ్య పోటీ నిర్వహించి ఒక్కోజాతి పశువులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న పాడి రైతులు సమీప పశు వైద్యాధికారిణి సంప్రదించి పేరును నమోదు చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్‌ఇండియా సీఎస్‌ఆర్ నిధులతో దివ్యాంగులకు ఉచితంగా అందించనున్న ఉపకరణాలకు సంబంధించి గుర్తింపుకార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు శక్తి, సామర్థ్యాల్లో ఎవ్వరికి తీసిపోరని, వారు సమాజంలో విడదీయలేని భాగమని తెలిపారు.రూ.50లక్షల విలువలగల పరికరాలను జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు అందజేయనున్నట్లు చెప్పారు. అర్హులైన వారిని గుర్తించే కార్యక్రమం టెక్కలి, పలాస డివిజన్లలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గుర్తించిన అర్హులైన దివ్యాంగులకు 45 రోజుల్లోగా ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కె.కవిత పాల్గొన్నారు.



దివ్యాంగులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు

● సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ : ఎస్పీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళంలో ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో జరిగే అరసవల్లి సూర్యనారయణస్వామివారి రథసప్తమి వేడుకలకు సంబంధించి భద్రత, బందోబస్తు ఏర్పాట్లు, అవసరమయ్యే పోలీసుఫోర్స్, సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రథసప్తమి వేడుకలకు పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముండడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి యుతంగా నిర్వహించేలా భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మూడు రోజులపాటు నిరంతరం సీసీకెమెరాలు, డ్రోన్‌కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని, ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటుచేసి పోలీసు సిబ్బంది, అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నగరపాలకసంస్థ అధికారులతో సంప్రందించి వాహనాలను ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాలు, లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. వాహనాల రాకపోకలను ఇబ్బందులు కలగకుండా, పట్టణంలో పెద్ద వాహనాలను రాకుండా అవసరమైన ప్రదేశాల్లో ట్రాఫిక్ మళ్లించాలని తెలిపారు. ఉత్సవాల్లో సూర్యనమస్కారాలు, శోభయాత్ర, క్రీడలు, హెలికాప్టర్ ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాల్లో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో పనిచేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, బాలింతలకోసం స్వచ్ఛంద సేవకుల సేవలు వినియోగించాలని కోరారు. ప్రధాన కూడళ్లలో బార్‌కేడ్లు ఏర్పాటు చేయాలన్నారు.అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళిక రూపొందించిలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కేవీ రమణ పి.శ్రీనివాసురావు, డీఎస్పీ వివేకనంద్, అప్పారావు, ప్రసాదరావు, శేషాద్రి పాల్గొన్నారు.

బాహుదా గ్రోయిన్ ఆధునికీకరించాలి



అశోక్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేశుపురం వద్ద బాహుదా నదిపై నిర్మించిన గ్రోయిన్ ఆధునికీకరించాలని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు కోరారు. ఈ మేరకు కేశుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు మంగళవారం రామయ్యపుట్టుగలో వినతిపత్రం అందజేశారు. కేశుపురం చిన్నగడ్డపై కాజ్‌వే నిర్మించాలని, చిన్నగెడ్డ నుంచి కొల్లె బట్టి వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు దాసరి రాజు, బుద్దాల నిర్మలారెడ్డి, నాయకులు సహదేవ్‌రెడ్డి, పద్మనాభం, కామేష్ పాల్గొన్నారు.

హాస్టళ్లకు భవనాలు నిర్మించాలి

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



సవితమ్మతో మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస, బూర్జ మండలాల్లోని రెండు బీసీ సంక్షేమ హాస్టళ్ల భవనాలు కూల్చివేసి నూతనంగా నిర్మించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఈమేరకు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖమంత్రి సవితమ్మను అమరావతిలోని సచివాలయంలో మంగళవారం కలిశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో మరికొన్ని వసతి గృహాలను మరమ్మతులు చేపట్టాలని కోరారు. వీలైనంత త్వరగా నూతన భవన నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని సవితమ్మ హామీఇచ్చారు.

కూటమి ప్రభుత్వం హామీల అమలు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ జెల్లపేటలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 31వ తేదీ వరకు శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

గేదెలవానిపేటలో పశువైద్య శిబిరం

ఆమదాలవలస, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గేదెలవానిపేటలో పశువైద్య శిబిరాన్ని పశు సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ స్వాతి, ల్యాబ్ టెక్నీషియన్ సుమతి, ఉమామహేశ్వరరావు, మోహన్‌రావు, జయ ప్రకాష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● బూర్జ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీపేటలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని పశువైద్యాధికారి జ్యోత్స్న ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు దేవాడ శ్రీనివాసరావు, పైల రామ్మూర్తి, జడ్డు కృష్ణ, బెజ్జిపురం స్వామినాయుడు, జడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, పశువైద్య సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. డొంకలపర్తలో కూడా పశువైద్య శిబిరం నిర్వహించారు.

రేపు మండల సమావేశం

సరుబుజ్జిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.పావని మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2024-25 సవరణ, 2025-26 అంచనా బడ్జెట్‌పై చర్చ జరుగుతుందని, దీంతో సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బావపై బావమరిది దాడి

శ్రీకాకుళం క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో బావపై బావమరిది దాడిచేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ కథనం మేరకు.. శ్రీకాకుళంలోని గోల్కొండరేవులో నివసిస్తున్న రామకృష్ణ, మొండేటివీధికి చెందిన హేమలతకు పదేళ్ల కిందట వివాహం జరిగింది. మూడు నెలల కిందట భార్యాభర్తల మధ్య మనస్పర్థల వల్ల రామకృష్ణ భార్య హేమలత పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం రాత్రి రామకృష్ణ తన భార్య వద్దకు వెళ్లి ఇంటికి రావాలని గొడవకు దిగాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న హేమలత తమ్ముడు సతీష్ రామకృష్ణ తలపై రాడ్డుతో దాడిచేశాడు. దీంతో గాయపడిన రామకృష్ణను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎం. హరికృష్ణ రిమ్స్‌కు వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

పారదర్శకంగా ప్రాక్టికల్స్: వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల ప్రాక్టికల్స్ మరింత పారదర్శకంగా, పూర్తిస్థాయి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. వర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని ఆధ్వర్యంలో వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల సైన్స్ సబ్జెక్టుల బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) సమావేశం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆయా సబ్జెక్టుల ప్రాక్టికల్స్‌కు కేంద్రాలను కొన్ని ప్రధాన కళాశాలలకు పరిమితం చేయనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు అవసరమైన చోట్ల స్క్వాడ్, పరిశీలకులను వర్సిటీ నియమిస్తుందని తెలిపారు. ప్రాక్టికల్స్ పరీక్షలు ముగిసిన తర్వాత ఆన్‌లైన్‌లో మార్కులు నమోదుకు పరీక్షల ఎక్స్‌టర్నల్‌కు అవకాశం కల్పిస్తామని చెప్పారు. పరీక్షల అనంతరం ప్రాక్టికల్స్ ఆన్సర్ స్క్రిప్టులను తిరిగి యూనివర్సిటీలకు తప్పనిసరిగా పంపించాలన్నారు. సమావేశంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయభాస్కర్, డీన్లు ఎన్.లోకేశ్వరి, పద్మారావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ఇచ్ఛాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు మార్చి 31నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చిన్నూరు మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2024 మధ్యలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. నిర్మాణాలు చేపట్టిన ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో బిల్లులు కూడా పడుతున్నాయని తెలిపారు.

మహిళా కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

గుజరాతీపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో మెడ్రన్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ సర్టిఫికెట్ కోర్సును బోటనీ శాఖాధిపతి ఎస్.రుద్రమరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగు తున్న జనాభాకు అవసరమైన ఆహారాన్నిఅందించాలంటే కొత్త వ్యవసాయ పద్ధతులు అవసరమని తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

108 మందికి స్కాలర్‌షిప్‌లు

శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో చదువుతున్న 108 విద్యార్థినులకు విప్రో కెరీర్, విప్రో ఫౌండేషన్ వారి సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు తెలిపారు. ఒకటో తరగతి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేసిన మెరిట్ విద్యార్థులకు 2024-25 విద్యాసంవత్సరానికి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏడాదికి 24వేల రూపాయలు చొప్పున మూడేళ్లు ఇస్తారని తెలిపారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన విద్యార్థి, అథ్లెటిక్స్ క్రీడాకారుడు అజిత్‌కు ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శిక్షణకోసం రూ.15500 అందజేశారు.ప్రతి నెలా రూ.2,500 అందజేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం హెచ్‌ఎం తిమ్మయ్య చేతులమీదుగా నగదు అందజేశారు. ఈ ఏడాదిలో జరగనున్న ఏసియన్ గేమ్స్ కోసం అజిత్ రౌర్కెలాలో శిక్షణ పొందుతున్నాడు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

గుజరాతీపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సిరిపురం తేజేశ్వరరావు ఆ పార్టీ నాయకులతో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిశారు. ఆయనతోపాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, ఎస్.ఉమామహేశ్వరి, జాతీయ కౌన్సిల్ సభ్యులు చల్లా వెంకటేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు ఉన్నారు.

బీఈడీ, ఇంజనీరింగ్, ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు సంబంధించి పలు సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం వర్సిటీ అధికారులు విడుదల చేశారు. బీఈడీ రెండోసెమిస్టర్‌లో 1,031కు 965మంది, ఇంజనీరింగ్ నాలుగో సెమిస్టర్‌లో 290 మంది పరీక్షకు హాజరుకాగా, 236 మంది, ఇంజనీరింగ్ ఆరో సెమిస్టర్‌లో 194 మంది హాజరుకాగా, 174 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో రెండో సెమిస్టర్‌కు 23కు 21 మంది, నాలుగో సెమిస్టర్‌లో 26కు 26 మంది, ఎనిమిదో సెమిస్టర్‌లో 24కు 20 మంది, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీలో రెండో సెమిస్టర్‌కు 91కు 90 మంది, నాలుగో సెమిస్టర్‌లో 92కు 91 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పీజీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

గీత కార్మికులకు రెండు దుకాణాల కేటాయింపు

సోంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కార్మికులకు రెండు షాపులు కేటాయించినట్లు సీఐ కె.బాబి ఒక ప్రకటనలో తెలిపారు. మందసమండలంలోని శ్రీశయనకు, కంచిలి మండలంలో సెగిడి సామాజిక వర్గానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈరెండు షాపులకు ఫిబ్రవరి ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేపు హిందూ ధార్మిక సభ

ఇచ్ఛాపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రత్తకన్న పాతాళ సిద్దేశ్వరాలయం ప్రాంగణంలో గురువారం హిందూధార్మిక సభ, వారాహి యాగం నిర్వహించనున్నట్లు హిందూధార్మిక సేవా సమితి వ్యవస్థాపకుడు బాలబ్రహ్మానంద సరస్వతి తెలిపారు. మంగళవారం పాతాళసిద్దేశ్వరాలయం సమీపంలో గల ఆశ్రమంలో ధార్మిక సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగామాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి 16 మంది పిఠాదిపతులు రానున్నారని తెలిపారు.

31 నుంచి వేదాంత శ్రవణం

శ్రీకాకుళంకల్చరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఈనెల 31 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకూ పెద్దలకు వేదాంత శ్రవణం,పిల్లలకు సంస్కార సుధ, విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గుజరాతీపేట లలితాదేవి పీఠం అర్చకుడు పెంట వశిష్ట కార్తికేయ శర్మ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శృంగేరి పీఠ ఆస్థాన విద్వాంసులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి ప్రవచనం ఉంటుందని తెలిపారు.

రిమాండ్ ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలు

నరసన్నపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న పేద ఖైదీలకు ఉచితంగా న్యాయసేవలను అందిస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాశి నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌జైలును సందర్శించారు. జైలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య, భోజన సదుపాయాలను పరిశీలించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. జైలు విజిట్ న్యాయవాది ఆర్.కొండలరావు, గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన వారు దరఖాస్తు చేసుకోండి

పాతపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పేద రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయసేవలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి ఆర్.సన్యాశి నాయుడు అన్నారు. సబ్ జైలును మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ సబ్‌జైల్‌లో ఖైదీ లకు మెనూ నిర్వహణ, వైద్య సేవలపై ఆరా తీశారు. పేదరికం కారణంగా న్యాయం జరగుడంలేదని పిస్తే దరఖాస్తు చేసుకుంటూ న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. సబ్‌జైల్ అధికారులు, న్యాయవాదులు ఉన్నారు.



పాతపట్నం: మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి సన్యాశినాయుడు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

కోటబొమ్మాళి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పొడుగుపాడు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బోరుమజ్జిపాలేనికి చెందిన కరుకోల శ్రీనివాసరావు (55) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య కుమారి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య, కుమారుడు హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా మృతుడు స్వగ్రామంలో ఉండేవాడని స్థానికులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాగంపాలేనికి చెందిన వ్యక్తి..


నారాయణరావు (ఫైల్)

లావేరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపాలేంకు చెందిన రౌతు నారాయణరావు (25) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నాగంపాలేంకు చెందిన రౌతు నారాయణరావు మద్యానికి బానిస అయ్యాడు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో తల్లిదండ్రులను భయపెట్టాలన్న ఉద్దేశంతో ఈనెల 26న వాటర్ బాటిల్‌లో గడ్డిమందు వేసుకుని తాగాడు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న నారా యణరావును చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆసు పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు హెచ్‌సీ రామారావు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నరసన్నపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌పీ గ్యాస్ గిడ్డంగి వద్ద సర్వీసు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం కైలాన పురానికి చెందిన నక్క రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. నరసన్నపేట నుంచి ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వెళు తుండగా వాహనం అదుపు తప్పింది. దీంతో రామకృష్ణకు తలపై బలమైన గాయాలు తగిలాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాపాయం నుంచి తప్పించొచ్చు

పలాసరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సతో రోగిని ప్రాణాపాయం నుంచి తప్పించ వచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అన్నారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ప్రథమ చికిత్స, సీపీఆర్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రమా దాలు జరిగినప్పుడు, ఎముకలు విరిగినప్పుడు ట్రయాంగిల్ బ్యాండేజీ ద్వారా ఏ విధంగా కట్టు కట్టాలి, ప్రథమ చికిత్స విధానాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్వీ రమణా రావు, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ నోడల్ అధికారి కొయ్యిల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలి

పలాసరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో ఇతరుల ప్రాణాలను కాపాడాలని టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ సెంథిల్ కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రత ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 54 యూనిట్లను సేకరిం చారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సభ్యులు వీవీకేవీ ప్రసాద్, మేనేజర్ అనీష్ జాన్, ఐఎంటీ సభ్యులు పాల్గొన్నారు.

'వంశధార' ఆధునికీకరణకు నిధులు కేటాయించాలి

కోటబొమ్మాళి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వంశధార ప్రాజెక్టు ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కోటబొమ్మాళి పార్టీ నాయకుడు హనుమంతు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి వంశధార ప్రాజెక్టు గుండె కాయ వంటిదని, దీనిని నిర్మించి 50 ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. అది ఏ మాత్రం కుప్పకూలినా వ్యవసాయ రంగం మొత్తం నష్టపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టు ఆధునికీకరరణకు రాష్ట్ర, కేంద్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు ఎందుకు చొరవ తీసుకోవడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

మామిడికి మంచు దెబ్బ

(మూడో పేజీ తరువాయి)

హెక్టార్‌కు పది టన్నుల వరకూ దిగుబడి రాగా.. గత రెండేళ్లుగా ఐదు టన్నుల మాత్రమే దిగుబడి వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తెగుళ్ల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి.. సస్యరక్షణకు సూచనలు అందించాలని కోరుతున్నారు.

దారి కనిపించడం లేదు



మా ప్రాంతంలో జీడి, కొబ్బరితో పాటు మామిడి సాగు చేస్తుంటాం. ఈ ఏడాది ఆరంభంలోనే మామిడికి మంచు దెబ్బ తీసింది. ఇప్పుడు పొగ మంచు పడుతోంది. తెగుళ్లు వెంటాడుతున్నాయి. అధికారులు మాత్రం ఎటువంటి సాగు సూచనలు ఇవ్వడం లేదు. ఈ ఏడాది కొబ్బరి ఉత్పత్తి కూడా పడిపోయింది.

- సాడి సహదేవ్‌రెడ్డి, రైతు, కొఠారి గ్రామం

పాడవుతున్న పంట



విపత్తులకు జీడి దెబ్బతింది. పోనీ మామిడి తోనైనా గట్టెక్కుదామంటే పంట పాడవుతోంది. ఈ ఏడాది అకాల వర్షాలతో వరికి నష్టం వాటిల్లింది. ఇప్పుడు మామిడి పంటను చూస్తే బాధ వేస్తోంది. పొగ మంచుతో పూత దెబ్బతింటోంది. తెగుళ్లతో మాడిపోతోంది. ఇది దిగుబడులపై ప్రభావం చూపుతుంది.

- దున్న లోకనాథం, రైతు, బూర్జపాడు, ఇచ్ఛాపురం

'గంజాయి'పై ఉక్కుపాదం

(మూడో పేజీ తరువాయి)

కోసం ఐదుగురు కేబినేట్ మంత్రులతో కమిటీ నియమించారు. దీనికి ఐజీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. ఎస్పీ, ఏఎస్పీలు బృందాలుగా పని చేస్తారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం. దీనికి డీఎస్పీ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా ఉంటారు. చిన్నారులపై లైంగిక దాడుల కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది. మావోయిస్టులు అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదు. ఇప్పటికే 30 మంది మావోయిస్టుల్లో 13 మంది ఆ పార్టీని వీడారని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నాం. జిల్లాలో మార్చి 31 నాటికి లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని డీజీపీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీపీ కొబ్బరి మొక్కను నాటారు. ఆయనకు ఎస్పీ దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివ్యాంగులు శిబిరానికి హాజరుకావాలి

కోటబొమ్మాళి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించనున్న దివ్యాంగుల సహాయ ఉపకరణాల డివిజన్ స్థాయి గుర్తింపు శిబిరానికి దివ్యాంగులంతా హాజరు కావాలని ఆ సంఘం జిల్లా ప్రతినిధి రత్నాల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులంతా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాళభద్ర రైల్వేగేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించండి


కేంద్ర మంత్రి రామ్మోహన్‌కి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాళభద్ర రైల్వేగేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మిం చేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ వైఎస్ ఎంపీపీ దాసరి జేజేరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును జిల్లా కేంద్రంలోని మంత్రి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు చెందిన 50 గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం కాశీబుగ్గకు రాకపోకలు సాగిస్తుంటారని, తాళభద్ర రైల్వే గేటుతో ఇబ్బందులు పడుతున్నార న్నారు. కార్యక్రమంలో అక్కుపల్లి టీడీపీ నాయకుడు సింగుపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో ఎదరూ అధైర్యపడవద్దని, అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కిడ్నీ వ్యాధి సమస్యతో బాధపడుతున్న నరసన్నపేటకి చెందిన పొట్నూరు గోవిందరావుకు వైద్యం నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.40,500 మంజూరు కాగా ఆ చెక్కును అందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కమిటీ కార్యదర్శి జామి వెంకట్రావు, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఉణ్న వెంకటేశ్వరరావు, కొరాడ వేణుగోపాల స్వామి, ముద్దాడ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

హిరమండలం,జనవరి28,(ఆంధ్రజ్యోతి) వాహన చోదుకులు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ ఎండీయాసిన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ద్విచక్రవాహన చోదుకలకు అవగాహన కల్పించారు. వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యంసేవించి డ్రైవింగ్‌చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

వజ్రపుకొత్తూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పూండి-గోవిదంపురం పంచాయతీలో 2020-2024 మధ్య ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్పీవో ఆర్.గోపిబాల మంగళవారం విచారణ చేపట్టారు. టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కర్ని రమణ జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈనెల 6న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.18 లక్షల వరకు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు డీపీవో ఆదేశాలతో డీఎల్పీవో మంగళవారం విచారణ చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రికా ర్డులను పరిశీలించిన తరువాత నివేదికను డీపీవోకి అందిస్తామని డీఎల్పీవో గోపిబాల తెలిపారు. విచారణలో మండల పంచాయతీ అధికారి డి.తిరుమలరావు, సర్పంచ్ పాలిన రమ్య, అగ్రికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: కలమట


మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

కొత్తూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. గత ఏడు నెలల్లో రూ.5లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. లోకేశ్ పాదయాత్ర చేపట్టి రెండేళ్లవుతున్న ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాసునాయుడు, ఎద్దు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలి

కొత్తూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను సోమవారం రాష్ట్ర సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. శాశ్వత భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పిం చాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని కలమట తెలిపారు.

పొగమంచుతో ఇక్కట్లు

ఎల్.ఎన్.పేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతిరోజూ రాత్రి 11 నుంచి ఉదయం సుమారు 10 గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూత దశలో ఉన్న మామిడి, జీడి తోటలు దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా నల్లగా మాగిపోయి కాపు రాకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా..



నందిగాం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రథసప్తమి నేపథ్యంలో పెద్ద తామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సూర్య నమస్కారాలు చేపట్టారు. హెచ్‌ఎం కె.గున్నయ్య, ఉపాధ్యాయులు శంకరరావు, కుమారి, వనిత ఆధ్వర్యంలో విద్యార్థులు సూర్యనమస్కారాల ఆసనాలు వేస్తూ ఆకట్టుకున్నారు.

ఆరు కేంద్రాల్లో 'సదరం' ధ్రువపత్రాల పునః పరిశీలన

● డీసీహెచ్‌ఎస్ డా.కల్యాణ్‌బాబు


ఓపీ సేవలపై వైద్యులు, నర్సులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబు

నరసన్నపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరు కేంద్రాల్లో దివ్యాంగులకు సదరం సర్టిఫికేట్ల పునఃపరిశీలన చేపడుతున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డా.కల్యాణ్ బాబు అన్నారు. మంగళవారం నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో సదరం కేంద్రాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిమ్స్ సర్వజన ఆసుపత్రి, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రుల్లో ప్రతీ సోమవారం నుంచి బుధవారం వరకు 31,548 మంది పింఛన్ పొందుతున్న వారి సర్టిఫికేట్లు పరిశీలించనున్నామన్నారు. బెడ్‌రెస్ట్‌లో ఉన్న 15 వేల మంది దివ్యాంగులను పరిశీలించడం జరిగిందన్నారు. 12 మంది ఇతర జిల్లాల వైద్యుల ఆధ్వ ర్యంలో సదరంలో సర్టిఫికేట్లు పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఓపీ సేవలు, ఇతర సేవలను పరిశీలించారు. వైద్యులు యూనిఫారం ధరించాలని, సిబ్బంది గుర్తింపు కార్డులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు, ఏడీ శేషగిరిరావు, ఏవో రమణమూర్తి, వైద్యులు భార్గవ్, సూర్యప్రకాశరావు, రమేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంలతో డిప్యూటీ కలెక్టర్ సమీక్ష

నరసన్నపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆదేశాల మేరకు జీవో నెం 117 ఉపసంహరణ విధానంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లోని క్లస్టర్ల హెచ్‌ఎంలతో డిప్యూటీ కలెక్టర్ లావణ్య మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలంలో మోడల్ పాఠశాలల ఏర్పాటుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఎటువంటి చర్యలు అనుసరించాలో హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆమె సంద ర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు దాలినాయుడు, శాంతారావు, మాదవరావు తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి: ఎంఈవోల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

పాఠశాలల బలోపేతానికి చర్యలు

టెక్కలి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని ఎంఈ వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో డివిజన్‌లో అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు మ్యాపింగ్, మౌలిక వసతులు, ఇతర అంశాలపై చర్చించారు. విద్యార్థుల హాజరు, పాఠ్యాంశ బోధన తీరు, మధ్యాహ్నభోజన పథకం అమలు తీరుపై ఆయన పలు సూచనలు చేశారు. టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి

పలాసరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రాథమిక పాఠశాలలు, ఫౌండేషన్ స్కూల్ నిర్వహణపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్డీవో గ్రంథి వెంకటేష్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం పలాస, మందస, వజ్రపుకొత్తూరు ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలకు అవసరమైన వనరుల సమకూర్చడంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఐవోలు సీహెచ్ శ్రీనివాసరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జగతిమెట్ట ఇళ్ల కాలనీలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు


కాలనీలో హెచ్చరిక బోర్డు పెట్టిన దృశ్యం

టెక్కలి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట ఇళ్ల కాలనీలో ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఇళ్లల్లో నివాసం ఉన్నది ఎవరు, ఖాళీ స్థలాలు, పట్టాలు ఇచ్చిన వారే ఉన్నారా, ఇతరులు ఉన్నారా వంటి వివరాలు సేకరించారు. రెవెన్యూ అధికారులు మంజూరు చేయని పట్టాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసిన చోట రెవెన్యూ అధికారులు 'ఇది స్థలం ప్రభుత్వ స్థలం, ఈ స్థలం ఆక్రమించినచో శిక్షార్హులు' అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. జగతిమెట్ట కాలనీలో 312 ఇళ్లలో ఇటీవల రెవెన్యూ అధికా రుల తనిఖీల్లో 55 ఇళ్లల్లో మాత్రమే పట్టాలు ఇచ్చిన వారు ఉంటున్నట్లు గుర్తించా రు. మంగళవారం 54 ఇళ్ల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఇవ్వనివి గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో తీగలాగితే డొంక కదిలే పరిస్థితి కనిపిస్తోంది. అయితే జగతిమెట్ట దరి ఇళ్ల కాలనీలకు సంబంధించి గృహ నిర్మాణశాఖ సిబ్బంది జియో ట్యాగింగ్ చేయడం, ఇళ్ల కాలనీలు మంజూరు చేయడం, బిల్లులు చెల్లించడంతో సర్వే చేసిన సిబ్బంది కంగుతిన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

సంతబొమ్మాళి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర పాలపోలమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. వేదపండితులు బూరాడ శ్రీనివాసశర్మ, ఆదిత్య శర్మ వేద మంత్రాల మధ్య హోమం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్థు లు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి: లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

31 నుంచి సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

హరిపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మదనాపురం గ్రామంలో ఈనెల 31నుం మూడు రోజుల పాటు శ్రీ సీతారామాల ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. సింహాచల దేవస్థానం పండితులు ముప్పిరాల నారాయణమూర్తి స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 31న ధ్రువ మూర్తుల ఊరేగింపు, అంకురార్పణ, ఫిబ్రవరి 1న ధాన్యాధివాసాలు, యాగశాల, మండప ఆవాహనలు, 2న యాగశాల అర్చన, శాంతిహోమం, శిఖర, విగ్రహ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

కొత్తూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పాత పొన్నుటూరు గ్రామంలో కోదండ రామాలయ నిర్మా ణానికి పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పారిశెల్లి రామరాజు రూ.25 వేల విరాళం మంగళవారం అందించారు. ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్స వాలు ఈనెల 31 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో దేవాలయం, విద్యాలయం, గ్రంథాలయం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎద్దు చామంతమ్మ, ఎద్దు సంతోష్ కుమార్, హెచ్‌ఎం గున్రాల కృష్ణారావు, ఉపాధ్యాయులు కుదమ తిరుమల రావు, విశ్రాంత వీఆర్‌వో బలగ అప్పారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పింఛన్ నిధులు మంజూరు

హిరమండలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీకి గాను నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో కాళీ ప్రసాదరావు తెలిపారు. 5841 మంది లబ్ధిదారులకు రూ.2,46,01,500 మంజూరై నట్లు చెప్పారు. ఫిబ్రవరి ఒకటో తేదీన పంపిణీ చేస్తామన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తు

వజ్రపుకొత్తూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలానికి ఒక మద్యం దుకాణం ఏర్పాటుకు శ్రీశయన ఉపకులస్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహి బిషన్, ఎక్సైజ్ సీఐ కె. మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తప్పనిసరిగా శ్రీశయన ఉపకులానికి సంబంధించిన ధ్రువపత్రం తహసీల్దార్ నుంచి పొందాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తులు చేసు కోవాలని, ఇతర వివరాలకు 95026 27569 నెంబరులో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

వ్యాధుల నివారణకు చర్యలు

టెక్కలి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్ అన్నారు. మంగళవారం తిర్లంగిలో ఉచిత పశు గర్భకోశ వ్యాధులు, పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులను బట్టి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణచంద్రరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, మాజీ సర్పంచ్ ధవళ రామచంద్రరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

పలాసరూరల్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ-సీడాప్- నైపుణ్యం-శిక్షణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం జాంబవతి తెలిపారు. శ్రీనిధి వెలుగు భవనంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. చిత్తూరుకు చెందిన ఫాటల్ కంపెనీలో ఆపరేటర్ పోస్టునకు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్ విద్యార్థులు అర్హులన్నారు. అన్నవరం పట్టణానికి చెందిన అవంతు ఫ్రోజెన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ప్యాకింగ్ పనులకు పదో తరగతి అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాల పోటీలను విజయవంతం చేయండి

పలాసరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విజయగనగరం జిల్లా తోటపాలెం గ్రామంలో ఫిబ్రవరి చివరి వారంలో జరుగు ఉత్తరాంధ్ర పాల పోటీలను విజయవంతం చేయాలని పశు సంవర్ధక శాఖ ఏడీ పి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో కోరారు. పూర్వపు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలో పాల దిగుబడినిచ్చే పాడి పశువుల మధ్య పోటీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సాహివాల్, ఒంగోలు, గిర్, రాఠి, నాటు ఆవు, జెర్సీక్రాస్, హెచ్ఎఫ్ క్రాస్ పశు జాతుల పాల ఉత్పత్తులపై పోటీ ఉంటుందని, ఆసక్తి ఉన్న రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టణాన్ని కమ్మేస్తున్న పొగ

● ఉక్కిరిబిక్కిరవుతున్న జగన్నాథపురం వాసులు


డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ

నరసన్నపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మేజర్ పంచాయతీ డంపింగ్ యార్డు నుంచి మూడు నెలలుగా ఎప్పటికప్పుడు దట్టమైన పొగ వస్తుండడంతో పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఒక వైపు మంచు ఇంకో వైపు వైపు ఈ పొగతో హైవేపై నరసన్నపేట-గుండువిల్లిపేట గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందవుతున్నాయి. ఈ పొగవల్ల శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని జగన్నాథపురం గ్రామస్థులు వేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

జలుమూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్న భోజనంలో శుచి, రుచికరమైన పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.లావణ్య అన్నారు. రావిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, లింగాలవలస ప్రాథమిక పాఠశాలలో రికార్డులు మంగళవారం పరిశీలించారు. భోజన పదార్థాలను రుచి చూశారు. సమయపాలన పాటించి క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.